
ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





మంత్రి 'డోలా'కు సన్మానం



ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి తరపున నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమశాఖా మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని శనివారం అమరావతిలోని అపర్ణ టవర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బొకె అంద జేసిన అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి గౌడపేరు ప్రసాద్ రావు , కార్యదర్శులు కసుకుర్తి నవరత్నం , దువ్వూరి రమేష్ చంద్ర , గౌడపేరు అనిల్ తదితరులున్నారు.


నెల్లూరు జిల్లాలోనూ తమిళనాడు రాజకీయాలు ఎక్కువయ్యాయి. అధికారంలో ఉంటే అక్రమాలు, అవినీతి, ప్రతిపక్షనేతలు, వారి కుటుంబ సభ్యులపట్ల అసభ్యకరమైన పోస్టింగులు, దాడులు వంటివి సాగిస్తున్న తెలుస్తోంది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత టిడిపి నేతల హెచ్చరికలతో నెల్లూరు రూరల్ వైసిపి నేతలు అనేక మంది సెల్‌ఫోన్ ఆఫ్‌చేసి వెళ్లిపోయారు. అధికారం అడ్డంపెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమాలకు పాల్పడినట్లు చెబుతోన్న నేతల ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కక్షసాధింపు చర్యల్లేవని చెబుతున్న ఆపార్టీ నేతలు కొందరు హెచ్చరికలు, అధికారుల నోటీసులతో పరారైనట్లు తెలుస్తోంది. వైసిపి నేతలను నమ్ముకొని వలంటీర్ పోస్టులు పోగొట్టుకున్నవారు లబోదిబో అంటున్నారు.

నెల్లూరు రూరల్ వైసిపిలో టెన్షన్..!

-70 మంది ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు నోటీసులు
-ముఖ్యనేతలు సెల్ ఆఫ్‌చేసి పరారీ
-నియోజవర్గంలో వలంటీర్లు లబోదిబో..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా ప్రశాంత రాజకీయాలకు పెట్టింది పేరు. 2019 ఎన్నికల తరువాత రాజకీయ కక్షలు ఎక్కువవుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, నేతలు ప్రతిపక్ష పార్టీలపై దాడులకు దిగారు. ఆస్తుల విధ్వంసం, కేసులు, వంటివాటితో టిడిపి నేతలను ఇబ్బందులకు గురిచేశారు. ఇసుక, గ్రావెల్, తెల్లరాయి, సిలికా, దందాలు సాగాయి. ప్రతిపక్షనేతలపైనా కేసులు పెట్టారు. అటు పోలీసులు, ఇటు వైసిపి నేతలు తప్పులు చేశారని టిడిపి నేతలు ఆరోపించారు. గెలిచిన కొద్ది రోజులు ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాడులు, కేసుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అప్పటి నుంచి మారారు. ఎన్నికలకు ఏడాది ముందు వైసిపి నేతలతో విభేదించి టిడిపిలో చేరారు. అటు తరువాత ఆదాల ప్రభాకరరెడ్డికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన తరువాత కొందరు వైసిపి నేతలు తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. అధికారిక పెత్తనం చేశారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులను చేతిలో పెట్టుకొని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలను ఇబ్బందులు పెట్టారు. ఎంఎల్‌ఎ లయినప్పటికీ ప్రోటోకాల్ పాటించ కుండా అవమానాలు చేశారు. కొందరు వ్యక్తులు నేరుగా ఆయనపై సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడం, కుటుంబ సభ్యులను మెసేజ్‌లు పంపడం వంటివి చేశారు. శ్రీధర్‌రెడ్డితో ఉన్న కొందరు కార్పొరేటర్లు, నేతలను బెదిరించి వైసిపిలో చేర్చుకున్నారనే విమర్శలు న్నాయి. వైసిపి నేతలు అధికారం అడ్డంపెట్టుకొని శ్రీధర్‌రెడ్డిపైన ఆదాల ప్రభాకరరెడ్డి ప్రతిపక్షాలను ఇరుకనపెట్టారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చాక తప్పులు చేసిన అనేక మంది వైసిపి నేతలు నెల్లూరు వదిలి వెళ్లిపోయారు. పోన్లకు అందు బాటులోకి రావడం లేదు. వైసిపి నేతలు ఒత్తిడి చేసి రూరల్ నియోజకవర్గంలో 93 మంది, నగరంలో 241 మంది వలంటీర్ల చేత రాజీనామాలు చేయించారు. ఇప్పుడు అడిగితే మాకు సంబంధం లేదు టూ ముఖం చాటేస్తు న్నట్లు సమాచారం.



అధికారులు జారీ చేసిన నోటీసు

70 మందికి నోటీసులు, బెదిరింపులు..!

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైసిపి నేతలు అనేక మంది పరారీలో ఉన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినందిని టిడిపి నేతలను ఇబ్బం దులకు గురిచేసిన ఏ ఒక్క నాయ కుడూ ప్రస్తుతం కనిపించడం లేదు. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అనుచరులకు కక్షసాధింపు చర్యల్లోద్దని హెచ్చరికలు జారీ చేశారు. అలాంటి వారిని తన కార్యాలయం గేటు తాకనివ్వనని చెప్పారు. ఎంత చెప్పినా వైసిపి నేతలు అనేక మంది నెల్లూరు వదిలి వెళ్లిపోయారు. టిడిపికి చెందిన కొందరు వ్యక్తులు తెలిసిన వారి వద్ద బెదిరింపులకు దిగడంతో భయంతో వెళ్లినట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎ కుటుంబాన్ని మానసికంగా ఇబ్బంది పెట్టిన వ్యక్తులను వదిలేదే లేదని కొందరు చెబుతుండడంతో ఏం జరుగుతుందోననే ఆందోళన వైసిపి నేతల్లో కనిపిస్తున్నట్లుంది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకుండా అధికారపార్టీ నేతల అడుగులకు మడుగులొత్తిన వారు ఇప్పుడు ఒక్కసారిగా నిబంధనలు గుర్తుకొచ్చాయి. నెల్లూరు రూరల్ పరిధిలో వైసిపి నేతలకు చెందిన 70 మందికి కార్పొరేషన్ అధికారులు నోటీసులు అందించారు. ఎంఎల్‌సిను దుర్భాషలాడిన కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి పడారుపల్లిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారు. దీనికి అనుమతి లేదంటూ అధికారులు నోటీసులు అందించారు. ఫతేఖాన్‌పేటలో వైసిపి నేత షాపింగ్ కాంప్లెక్స్, భక్తవత్సల నగర్ నేత ఇంటికి ఇలా సుమారు 70 మంది వరకు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో వైసిపి నేతలు రాజీ కోసం పెద్దలకు చేసినా ఫలించనట్లు తెలిసింది. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వైసిపి నేత వైవి రామిరెడ్డికి ఏకంగా మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డారంటూ రూ.75 కోట్లు అపరాధ రుసుము విధించారు. ఏం జరుగుతుందోననే ఆందోళన వైసిపి నేతల్లో కనిపిస్తోంది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. బయట వెళ్లిపోయిన నేతలు ఇప్పట్లో వచ్చేలా కనిపించడం లేదు. రాజకీయ కక్షలు పక్కనపట్టి ప్రశాంత వాతావరణం రావాలని ప్రజలు కోరుతున్నారు.



పడారుపల్లిలో కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని అద్భుతంగాఅభివృద్ధి చేసి ఐదు అత్యుత్తమ రాజధానుల సరసన నిలిపే దిశ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం చింతారెడ్డి పాలెంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆవరణలోని తన స్వగృహంలో మంత్రి పాత్రికే యులతో మాట్లాడారు. మంత్రి నారాయణ మాట్లా డుతూ అధికారులతో చర్చించి ఒక కార్యాచరణ రూపొందించుకొని సుమారు రెండున్నరేళ్లలోనే అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కషి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నూరు శాతం విద్యార్థులు

హాజరయ్యేలా దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-వెంకటాచలం : అంగన్‌వాడీ కేంద్రాలకు నూరుశాతం విద్యార్థుల హాజరయ్యేలా దృష్టి సారించాలని కలెక్టర్ హరి నారాయణ తెలిపారు. మండలంలోని బురాన్ పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. కేంద్రానికి చిన్నపిల్లలు కచ్చితంగా హాజరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు.అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనం ఇతర వివరాల గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయంలో తనిఖీ

ఉలవపాడు : ఉలవపాడులో శనివారం ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి శాఖా గ్రంథాలని ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు ఆమె గ్రంథాలయం పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ సమస్యలను గ్రంథ పాలకుడు కోటేశ్వరావుని అడిగి తెలుసుకున్నారు

ఎంఎల్ఎలకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి తరపున ఎన్నికైన ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎంఎల్ఎ మద్దులూరి మాలకొండయ్యలను యాదవ సోదరుల ఆధ్వర్యంలో శనివారం కందుకూరులో ఘనంగా సన్మానించారు. కనిగిరి రోడ్డులోని ఎం.ఎం.కొండయ్య ఇంటి వద్ద కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు, కొండేపి, చీరాల నియోజ కవర్గాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, ఇంకా పలువురు ప్రముఖులు ఇద్దరు నేతలను కలిసి శాలువాలు, బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎంఎల్ఎ ఎం.ఎం కొండయ్య, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు, ఎం.ఎం.కొండయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. అప్పనబోయిన నరసింహం, వై. లక్ష్మీ నారాయణ పీలా శ్రీనివాసరావు, కుర్రా సూర్యనారాయణ, రామకష్ణ, గెట్టిబోయిన మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండలపార్టీల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీ నరసింహం, వేముల గోపాల్ రావు, పట్టణ మాజీ అధ్యక్షుడు పిటికటి వెంకటేశ్వర్లు ఉన్నారు.



శ్రీశ్రీకి ఘన నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన మహాకవి శ్రీ శ్రీ 41వ వర్ధంతి ని పురస్కరించుకొని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కోటారెడ్డి భవన్ లోని బుద్ధ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు కిషోర్ మాట్లాడారు. మంచు పొగ రచయిత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ధమ్మ చక్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉపాసకులు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడారు.

మంత్రి నారాయణతో

కలెక్టర్, ఎస్పి మర్యాదపూర్వక భేటి

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నగరానికి విచ్చేసిన మంత్రి పొంగూరు నారాయణ కు పలువురు ప్రము ఖులు అభినందనలు తెలిపారు. శనివారం చింతారెడ్డిపాలెం లోని మంత్రి నివాసంలో కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



నారాయణతో భేటి అయిన కలెక్టర్, ఎస్పి

ఎంఎల్ఎ 'ఇంటూరి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని ఉలవపాడు ఆర్యవైశ్య నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు పలు విషయాలను ఆయన దష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటాన ని నేరుగా నా వద్దకు వచ్చి సమస్య తెలుపవచ్చని హామి ఇచ్చారు. ఉలవపాడు ఆర్యవైశ్య నాయకులు వాగి చెర్ల వెంకట నాగరాజు, వావిచెర్ల వెంకట రాఘవేంద్ర కుమార్, డాక్టర్ బాపనపల్లి పవన్ కుమార్,న్యాయవాది బాపనపల్లి శేషయ్య, బాపనపల్లి గిరి,శ్రీరామ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



'ఇంటూరి' అభిమానుల పాదయాత్ర

ప్రజాశక్తి-కందుకూరు : సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గ ఎంఎల్‌ఏగా ఇంటూరి నాగేశ్వరావు భారీ మెజారిటీ తో గెలవడం ముఖ్య మంత్రిగా ఎన్నికైన నేపథ్యాన్ని పురస్కరించుకుని అబ్బురి వేణు ఆధ్వర్యంలో ఇంటూరి నాగేశ్వరావు అభిమానులు అంకమ్మ తల్లి ఆలయం నుంచి తిరుమలకు గత శనివారం పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర ఎనిమిదో రోజులు పాటు 226 కిలోమీటర్లు సాగి అలిపిరి చేరుకుంది. అబ్బూరి వేణు, అబ్బూరి చందు, మధిర బ్రహ్మరూప్, పత్తిపాటి పవన్, వేములూరి సాయి, వేములూరి బ్రహ్మం, వేంకట్, రమణయ్య, సంపత్, శ్రీను, ప్రకాష్,వెంగబాబు, బాబీ ఉన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-కందుకూరు : స్కూల్, కాలేజీలు పునః ప్రారంభమైనంద విద్యాసంస్థల యజమానులు తమ బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు తప్పని సరిగా చేపించుకోవాలని కందుకూరు మోటా రు వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కె ఎమ్‌డి రఫీ తెలిపారు. కందుకూరు ఎం.వి. ఐ కారాయలయ పరిధిలో ఇప్పటి వరకు 50 వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. కళాశాలలు పునః ప్రారంభించిన సందర్భముగా జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు ఆదేశాల మేరకు ఫిట్‌నెస్‌లేని విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులపై స్పెషల్ డ్రైవ్ ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల బస్సులు నడుపు డ్రైవర్లు 60 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు.



ఎమ్‌డి రఫీ

ఎరువుల దుకాణంలో తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని వివిధ ప్రయివేటు విత్తన షాపులను కందుకూరు మండల వ్యవసాయాధికారి వి రాము తనిఖీ చేసి విత్తన యజమానులకు, రైతులకు సూచనలు చేశారు. తొలకరి వర్షాలు కురుస్తుండటంతో డీలర్లు తప్పనిసరిగా రైతులకు కావాల్సిన వివిధ రకాల పంట విత్తనాలను అందుబాటులో ఉంచాలని, విత్తన నిల్వ పట్టికలో నిల్వ స్టాకు, రేట్లను , మొలక శాతం కట్టి రైతులకు అమ్మకపు రసీదు ఇచ్చి అమ్ముకోవాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా లైసెన్సు ఉన్న విత్తన ధ్రువీకరణ డీలర్లు దగ్గర మాత్రమే కొనుగోలు చేస ఎకోవాలన్నారు.

మాజీ వార్డు సభ్యునిపై దాడి

నెల్లూరు : రూరల్ నియోజకవర్గ టిడిపి నాయకులు , మాజీ వార్డు సభ్యులు కొల్లూరు వీర రాఘవులు పై ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. శనివారం కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఓ స్థల విషయంలో వీర రాఘవులు, స్థానిక వైసిపి నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. వైసిపికి చెందిన కొందరు నాయకులు ఒక్క సారిగా మరణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన వీర రాఘవులను స్థానికులు హుటాహుటిన జిజిహెచ్‌కి తరలించారు. అనంతరం అపోలో వైద్యశాలకు తరలించారు.

రాజకీయ కోణం లేదు : టిడిపికి చెందిన మాజీ వార్డు సభ్యులు కొల్లూరు వీర రాఘవులుపై వైసిపికి చెందిన కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినటుసోషల్ మీడియాలో వచ్చిన అసత్య కథనాలని వాటిని నమ్మొద్దని రూరల్ డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి పేర్కొన్నారు.

ఆంగ్ల పరిజ్ఞానం పెంపుదల

అదాని ఫౌండేషన్ కృషి

అదాని కష్ణపట్నం పోర్టు సిఇఒ జిజె రావు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఇంగ్లీష్‌లో పరిజ్ఞానం పెంపొందించేందుకు అదాని ఫౌండేషన్ ప్రత్యేక కృషి చేస్తోందని ఆదాని కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జిజె రావు పేర్కొన్నారు. కృష్ణపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రాథమిక ఆంగ్లవ్యాకరణ, ఆంగ్ల భాషలో సంభాషణలపై శనివారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంబించారు. ఈ సందర్భంగా సీఇఓ జిజె రావు మాట్లాడుతూ మూడు నుంచి పదో తరగతి వరకు చ దువుతున్న గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం పొందేందుకు ఆదాని కృష్ణపట్నం పోర్టు కృషి చే స్తోందని తెలిపారు. అదాని ఫౌండేష న్ మొదటి దశలో ఉత్తన్ స్కీం ద్వారా విద్యార్థులకు ఆంగ్ల సంభాషణ కు సంబంధించి కృష్ణపట్నం ఉన్నత పాఠశాలలో తరగతులు ప్రారంభిం చినట్లు చెప్పారు. ౧. కృష్ణపట్నం జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ సహకారంతో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అదానీ ఫౌండేషన్ తన వంతు సహాయ సహకారాలు అందించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



మాలకొండలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు : ఇంటూరి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయం అని కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీ నరసిం హస్వామిని శనివారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శిం చుకున్నారు. ఎంఎల్ఎ కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. ఎంఎల్ఎ దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. గోశాలను సందర్శించి గోమాతకు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్ర మంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. ఎంఎల్ఎ నాగేశ్వరరావు ఆలయ ఆధి కారులతో మాట్లాడుతూ. ఆలయానికి పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. దూరప్రాం తాల నుండి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా చూడాలన్నారు. అనంతరం ఎంఎల్ఎ కుటుంభ సభ్యులు ఎలక్ట్రికల్ ఆటోలో ఎక్కి తిరిగారు. అనంతరం ఆలయంలో జరగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కెబి శ్రీనివా సరావ, వలేటివారిపాలెం, గుడ్లూరు, కందుకూరు పట్టణ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, జనగర్ల నాగరాజు, మల్లేశ్వరరావు, నాయకులు చెరుకూరి వంశీకష్ణ కామినేని అశోక్ ఉన్నారు.



మాలకొండలో ఇంటూరి కుటుంబ సభ్యులు

వెంకటరమణయ్యకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-వెంకటాచలం : గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర విభాగం పరిశోధన విద్యార్థి దాసరి వెంకటరమణయ్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మండలంలోని సర్వేపల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణయ్య నాగార్జున యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతీదేవి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఉద్యానవన రైతుల సాంఘిక, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి పరిశోధన చేశారు. దీంతో వెంకటరమణయ్యకు నాగార్జున యూని వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వెంకటరమణయ్యకు వర్సిటీ వీసీ పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ పి.కరుణ పరిశోధన విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి, ఆర్థిక శాస్త్ర విభాగధిపతి కె. మధుబాబు కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

మూల్యాంకనంలో తప్పక పాల్గొనాలి

నెల్లూరు సిటీ : 2024 మేలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డ్ ఆన్ లైన్ లో మూల్యాంకాన్ని నిర్వహిస్తుందని జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అన్ని సబ్జెక్టుల లెక్చరర్లు తప్పనిసరిగా ఈ మూల్యాంకనంలో పాల్గొనాలని ఇంటర్మీడియట్ నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఏ .శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని వివిధ ప్రయివేట్ కళాశాలల ప్రిన్సిపల్ లెక్చరర్‌లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు

16న జనసేన విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు : జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలల్లో విజయం సాధించడాన్ని పురస్కరిం చుకోని ఈ నెల 16వ తేదిన నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు నూనె మల్లికార్జున్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక ఆమని గార్డెన్స్ లో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు వై. రవి కుమార్, కష్ణారెడ్డి, శ్రీరామ్, కిషోర్, నాగరత్నమ్మ, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

కేర్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : మాతా శిశు మరణాల రేటును తగ్గించాలన్న ఆలోచనతో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్),వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా కంగారు మదర్‌కేర్ యూనిట్‌ను నగరంలో ప్రారంభిస్తున్నట్లు ట్రస్టు అధినేత టి.వసంతలక్ష్మి, ఐఓసిఎల్ డివిజినల్ రిటైల్ హెడ్ ఎ.వి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రిచ్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టరు టి.రవికుమార్ మాట్లాడారు. ఉన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు

నెల్లూరు : గుర్తింపు లేకుండా కొత్త నిబంధన పాటించకుండా విద్యాసంస్థల నడుపుతున్న ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలపైచర్య తీసుకోవాలని శనివారం నెల్లూరు సిటీలో అనేక విద్యాసంస్థల ముందు పిడిఎస్‌యు ఆందోళన నిర్వహించింది. అనంతరం డిఇఒ ఆఫీస్‌లో ఏడి మేడంకి వినతిపత్రం అందజేశారు. సిటీ అధ్యక్షులు ఆశీర్వాదం ఉన్నారు.

నారాయణ వైద్యశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టరు పి.నారాయణ 67వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని నారాయణ వైద్యశాలలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. శనివారం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ అధినేత పుట్టిన రోజును పురస్కరించుకోని కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు మంత్రి నారాయణ సతీమణి రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మంత్రి నారాయణ సతీమణి రమాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. అనంతరం నారాయణ వైద్యశాల పి.ఆర్ అండ్ మార్కెటింగ్ విభాగాధిపతి , ఏజిఎం ఎసి శేఖర్‌రెడ్డి రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. నారాయణ వైద్యశాల ఆపరేషన్స్ హెడ్ రామారావు, సిఎఫ్ఓ సురేష్, నారాయణ నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఎన్.ఇందిర ఉన్నారు.



త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం : నారాయణ

నెల్లూరు : త్వరలోనే నగరంలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని...పేద, నిరుపేదలందరికి రూ. 5లకే మంచి భోజనం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని మద్రాస్ బస్టాండ్, స్టోన్ హౌస్‌పేటలోని అన్న క్యాంటీన్, బందావనంలోని అన్న క్యాంటీన్ ను ఆయన సందర్శించారు. అన్న క్యాంటీన్లలోని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లడారు. 2014 నుంచి 2019 వరకు తమ ప్రభుత్వ పాలనలో రోజుకి 2 లక్షల 25వేల మంది రూ. 5 లకే చక్కటి భోజనం తినే విధంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్.. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్ రెడ్డి ఉన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో మాలకొండకు పాదయాత్ర

ప్రజాశక్తి - లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులుగా ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో యర్రారెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు మాలకొండకు పాదయాత్ర చేపట్టారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి గ్రామంలో రాములవారి దేవాల యంలోనూ, నాగార్పమ్మ గుడిలోనూ ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారం భించారు.గ్రామ పార్టీ అధ్యక్షులు ఉట్లపల్లి పెద్ద మాధవరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజారపు మాల కొండయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని టిడిపి నాయకులు,తెలుగు యువత నాయకులు పాదయాత్ర చేస్తూ అయ్యవారిపల్లి మీదుగా మాలకొండకు చేరుకున్నారు. మాలకొండలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొని మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దర్శించుకుంటారు. 20 ఏళ్ల తర్వాత కందుకూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి శాసన సభ్యులుగా గెలుపొందడం పార్టీ శ్రేణులు నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చిందని మాలకొండయ్య తెలిపారు. టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గన్నారు.



పాదయాత్ర చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రిని కలిసిన మోషే

ప్రజాశక్తి-కందుకూరు : సిఎం నారా చంద్రబాబు నాయుడుని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శనివారం నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యనిర్వా హక కార్యదర్శి గౌడపేరు ప్రసాదరావు , కార్యదర్శులు కసుకుర్తి నవరత్నం , గౌడపేరు అనిల్ , దువ్వూరి రమేష్ చంద్ర తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

కేబుల్ వైరు చోరీ

గుడ్లూరు : గుడ్లూరు, లింగసముద్రం మండలాలలోని 40 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్న భారీ మంచినీటి పథకానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి సమయములో పగల కొట్టి అందులో ఉన్న రాగి వైరును అపహరించినట్లు ప్రాజెక్టు నిర్వాహకులు శనివారం ఫిర్యాదు చేశారు. గుడ్లూరు సమీపంలో ఉన్న ఉప్పుటేరులో నిర్మించిన మంచి నీటి పథకానికి సంబంధించి మోటారు పంపు చెట్టు కేబుల్ వైర్ ని గుర్తు తెలియని దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు. దీంతో భారీ మంచినీటి పథకం ద్వారా సరఫరా తాగునీరు నిలిచిపోయింది.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్‌ఏగా గెలుపొందాక మొదటిసారిగా ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావ పాల్గొన్నారు. కందుకూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్టూడెంట్ కిట్స్ ఎమ్మెల్యే నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఒక్కొక్క కిట్ లో బ్యాగ్ తో పాటు, టెక్స్ పుస్తకాలు, 13 నోట్ పుస్తకాలు, సాక్స్, యూనిఫారం, బెల్ట్, ఒక డిక్షనరీలు ఉన్నాయి. కందు కూరులోని బాలుర, బాలికల హైస్కూల్స్, మాచవరం హైస్కూల్, పలుకూరు హైస్కూల్ లోని మొత్తం 2075 మంది విద్యార్థులకు కిట్స్, బాలికలకు ఆర్‌టిసి బస్ పాస్ లు అందజేశారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.ద్వారకారాణి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ ప్రసాదరావు, ఎంఈఓ సుబ్బారెడ్డి, హెచ్‌ఎంలు నరసింహమూర్తి, మాల్యాద్రి, షౌకత్ ఆలీ, కమల్ కుమార్, టీచర్ ఎ సాంబశివరావు ,పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు ఉన్నారు.



డాక్టర్ ప్రభాకరనాయుడు జన్మదిన వేడుకలు


ప్రభాకర్‌నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : స్థానిక పి.ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్, ప్రజావైద్యులు, మాజీ కావలి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర నాయుడు 87వ జన్మదినం సందర్భంగా శనివారం కావలిలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల ఆధ్వర్యంలో డాక్టర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి దుస్సాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు ప్రశంగిస్తూ డాక్టర్ ప్రభాకరనాయుడు 1980వ సంవత్సరంలో ప్రభుత్వ వైద్యులుగా కావలికి వచ్చి తదుపరి రాజకీయాలలో ప్రవేశించి, ప్రజల మన్ననలు పొంది మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై అంకిత భావంతో విధులు, బాధ్యతలు నిర్వహించి, అందరి మన్ననలు పొందారన్నారు. సొంతంగా వైద్యశాల ఏర్పాటు చేసుకొని, వైద్య సేవలు అందిస్తూ, పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, వివిధ విభాగాలకు సంబంధించిన సూపర్‌స్పెషాలిటీ వైద్యులను, కావలికి రప్పించి వైద్యసేవలు అందిస్తూ ఇప్పటివరకు, వ్యయ ప్రయాసలతో 124 ఉచిత మెగామెడికల్ క్యాంపులు, అన్ని వసతులతో నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆయన వివిధ రకాల ఒక లక్ష ఆపరేషన్‌లు నిర్వహించారన్నారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా, ప్రియదర్శిని మహిళా మండలి షేక్.ఖాదర్‌బీ, రత్నమ్మ ఫౌండేషన్, ఎంవిఎన్.ప్రసాదరావు రావు, వాయిస్ ఆఫ్ ముస్లీమ్ మైనారిటీ మొఘల్ సలీం బేగ్, రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ అబ్దుల్ అలీం, టైం టు హెల్ప్ నందిపాటి రమేష్, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, గుడ్‌మెన్ బ్రహ్మయ్య, విజయ భారత్ ట్రస్ట్ వనజ, ఘంటసాల రామచంద్రయ్య, లాయర్ నాగేంద్ర, పి.ఆర్.ఒ. ఆనంద్, ప్రసాద్, నున్నామురళి, రావులకొల్లు బాలకృష్ణ, సీనియర్ పాత్రికేయులు కందికట్లు నారాయణ, సిద్దిజయప్రతాప్ రెడ్డి, షేక్. మస్తాన్, ఎస్.బాబురావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలకోనకు పాదయాత్ర



ప్రజాశక్తి-అనంతసాగరం : రాష్ట్రంలో టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించాలని, ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి గెలుపొంది మంత్రి పదవి వస్తే చిలకలమర్రి నుండి పెంచలకోన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వరకు 48 కిలోమీటర్ల దూరం పాదయాత్రగా కాలి నడకన నడచి వస్తానని మండల అధ్యక్షురాలు సునీతమ్మ మొక్కుకున్నారు. ఆమె కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ పాదయాత్రకు జిల్లా హ్యూమన్ రైట్స్ అండ్ ఆఫెన్స్ కంట్రోల్ కమిటీ అధ్యక్షులు కానగల వెంకట రమణయ్య మద్దతు ప్రకటించి ఆశీర్వదించారు. పాదయాత్రలో చల్లా తిరుపతమ్మ, మహిళలు, టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత



ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం కావలి పట్టణ శివారు ప్రాంతమైన శివరామసుబ్బయ్య కాలనీలోని నిరుపేద గిరిజనులకు దుప్పట్లు, ఎగ్ బిర్యానీ అందజేశారు. కావలి 1వ పట్టణ ఎస్.ఐ. షేక్.జమాల్ వలీ, హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జమాల్‌వలీ మాట్లాడుతూ పేదల తలరాతలు మార్చేది చదువు ఒక్కటేనని, చదువుకుంటే ఉజ్వలభవిష్‌త్ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ తప్పని సరిగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రోజు గూడల.ప్రత్యూష ఎంతో కష్టపడి చదివి మంచి ఉద్యోగం సంపాదించడం మనందరికీ ఆదర్శం ప్రత్యూషను మనందరం ఆదర్శంగా తీసుకొని అందరం చదువుకుందామన్నారు. హ్యాపీ సేవాసంస్థ ద్వారా సంస్థ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషాను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ కార్యక్రమానికి దాతగా నిలచిన గుడల.నిర్మలను వారి అమ్మాయి గూడల.ప్రత్యూష సేవలను కొనియాడారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీభాషా మాట్లాడుతూ గూడల.నిర్మల భర్త గూడల.మాల్యాద్రి రోడ్డు యాక్సిడెంట్‌లో మృతి చెంది ఇద్దరు చిన్నపిల్లలతో మిగిలిన నిర్మల కుంగి పోకుండా ఇద్దరు పిల్లలను బాగా చదివించి, ఈరోజు చిన్నపాప అయిన గుడల.ప్రత్యూషకు చిన్నపాటి ఉద్యోగం వచ్చినందుకు మొదటి జీతంతో పేదలకు సాయం చేయడం ఎంతో అభినందనీయం అన్నారు.మీ పిల్లలను కూడా బాగా చదివించాలని అవసరమైతే హ్యాపీ సేవాసంస్థ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో దాత గూడల. నిర్మల, హ్యాపీ సేవాసంస్థ సలహాదారులు చేవూరు. ప్రభయ్య, ఉపాధ్యక్షులు దేవరకొండ.విజయ్, కోశాధికారి మారుబోయిన. నాగరాజు, సయ్యద్. నౌషాద్ అలీ, కొత్తపల్లి.పద్మ, జక్కంపూడి.ప్రభావతి సేవలందించారు.

ఆదాయ వ్యయంపై సర్వే

ప్రజాశక్తి-ఉదయగిరి : అసంఘటిత రంగంలోని తయారీ, వ్యాపార, సేవారంగ ఆదాయ వ్యయంపై ఎన్ఎస్ఒ ఎన్యూమరేటర్ ఆర్.వినయ్ సర్వే నిర్వహించారు. గత వారం నుండి జరుగుతున్న నామూనా సర్వే ముగింపు దశకు వచ్చిందని ఉదయగిరి సుమారు 120 గృహాలు సర్వే నిర్వహించామని ఎన్యూమరేటర్ వినయ్ తెలిపారు. జాతీయ గణాంక కార్యాలయం గణాంక మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వానికి ఈ సర్వే చేయడుండని తెలిపారు. ఈ సర్వే ద్వారా అసంఘటిత రంగంలోని అన్ని వర్గాల వారి స్థితిగతులను అంచనా వేయడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ సర్వేలో భాగంగా ఉదయగిరిలో మూడు వీధులను ఎంపికచేసుకొని జరిగిందన్నారు. అందులో ప్రతి ఏరియా నుండి 100 కుటుంబాలను ఎంపికని ఈ సర్వే చేయడమైనావ్నారు. అందులో భాగంగా ఎన్ఎస్ఒ ముందిన కరపత్రాలను అందచేశామన్నారు. ఆయనవెంట విఆర్ఎ ఖరల్, కబీర్ వాస్తారులు ఉన్నారు.

బడిలోనే బాలల భవిత

ప్రజాశక్తి-కొవ్వూరు : బాలబాలికలందరూ బడిలో చేరడం ద్వారా భవిత మార్చుకోవచ్చని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్ బాబు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం గ్రామంలో "నేను బడికి పోతా" కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి బయట పిల్లలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికా విద్యలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బాలికల చేత మొక్కలు నాటించారు.అనంతరం మండల కేంద్రంలోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్ ను పరిశీలించి వస్తువుల నిల్వను తనిఖీ చేశారు. కార్యక్రమంలో విద్యా శాఖాధికారి ఎం.దిలీప్ కుమార్, ప్రధానో పాధ్యా యులు సింగారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, వేణు, మున్వర్ అహ్మద్, బ్రహ్మారెడ్డి, విజయ కుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కావలి : బక్రీద్ పర్వదినం సందర్భంగా 17న సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల ప్రకారం సామూహిక జంతువధ కార్యక్రమం, గోవులను వధించే కార్యక్రమాలు నిషేధం కావున కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముస్లిం సోదరులందరూ పైఆదేశాలను గమనించి ప్రభుత్వ నియమాలను లోబడి పాటించాలని ఆర్డీఓ వి.కె. శీనానాయక్ ప్రకటనలో కోరారు. అనుమతించబడిన ప్రదేశాలలో మాత్రమే నిర్దేశిత జంతువధ కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా కోరారు. కావలి డిఎస్‌పి తమ సిబ్బంది డివిజన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ విషయంలో తగు ముందస్తు చర్యలు తీసుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి అడివి పేరంటాలమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని గ్రామంలో పంచాయతీలో వెలసిన అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి గడ్డంవారిపల్లెలో నిలుపుతో ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మేడపల్లి వెంకటయ్య శుక్రవారం తెలిపారు. 16న ఆదివారం సాయంత్రం గడ్డంవారిపల్లి గ్రామం నుంచి గొల్లపల్లి 17న సోమవారం కోటపల్లి, కోటాలపల్లి బీసి కాలనీ సర్వరా బాద గొల్లపల్లి గ్రామాలలో గ్రామోత్సవం 18న మంగళవారం మిట్టపల్లి గడ్డంవారిపల్లి జెట్టివారిపల్లి అడవి పేరంటాలమ్మ నగరోత్సవంలో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 19న బుధవారం పసుపు కుంకుమ బండ్లు సొమ్ముల కార్యక్రమాలు బాణసంచా కాల్పులు 20వతేదీ గురువారం బండ్లు పొంగళ్ల సాంస్కృతిక కార్యక్రమాలు బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. బండలాగుడు పోటీలో పాల్గొనే వారు యజమానుల ఫోన్ 9393233331 నెంబర్ ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రామలింగేశ్వర ఆలయంలో వేలం

ప్రజాశక్తి వింజమూరు : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం దేవాదాయ శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఆయనతో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పోటాపోటీగా వేలం పాడుకున్నారని దేవాదాయ శాఖ అధికారి జి రామకృష్ణ తెలిపారు. ఈ ఆదాయాన్ని దేవాదాయ శాఖ ద్వారా దేవాలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ గుమస్తా పి వెంకటేశ్వర్లు, ఇఒ జి రవీందర్ రెడ్డి, మాజీ చైర్మన్ చంద్రయ్య, ధర్మకర్తలు, నాయకులు అవుల వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువు

- ప్రహరీలు లేక అసంఘిక కార్యక్రమాలు
- ఈ పాఠశాలలను గుర్తించండి సార్..



రక్షణ గోడ లేక పశువుల మలమూత్ర విసర్జాలతో అధ్వాన పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల

ప్రజాశక్తి-ఉదయగిరి

మనబడి నాడు - నేడు పాఠశాలలో రూపురేఖలు మార్పు చేస్తూ అనేక పాఠశాలను బాగుపరిచారని తమ పాఠశాలను కూడా గుర్తించాలని స్థానికులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంకటరావుపల్లి, ఎస్‌సి కొండాయపాలెం, గంగిరెడ్డిపల్లి, ఉదయగిరి షబ్బీర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పాఠశాలలకు ప్రహరీలు లేక పాఠశాల ఆవరణంలో పశువులు మలమూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజు శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. పిల్లలు చదువుకునేందుకు పాఠశాలల్లో ఉన్న వాటికి రక్షణ కరువైందని చదువు నేర్పే బడులను గుడిగా భావించే వారు కొందరుంటే వాటిని అసాంఘిక కార్యక్రమాలకు వాడుకునేందుకు మరికొందరికి ఈ పాఠశాలలు ప్రహరీ లేక వారికి అడ్డగా మిగిలాయని వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులు గుడిగా భావించే ఈ బడులకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు కోరుతున్నారు. పలుచోట్ల ప్రభుత్వ భవనాలకు ప్రహరీలు లేక దర్శనమిస్తున్న పాఠశాలలతో విద్యా ర్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు.

చింతం శేషారెడ్డికి నివాళులు


చింతం శేషారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి రూరల్

కావలి రూరల్ మండల పరిధిలోని గౌరవరం గ్రామంలో శనివారం చింతం శేషారెడ్డి 45వ వర్ధంతి సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళూరు మాల్యాద్రి, జిల్లా రైతు సంఘం నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు మాట్లాడారు. 1979 సంవత్సరంలో తీవ్రమైన రైతు సంక్షోభంలో వచ్చిన తుపాన్‌కు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం రైతంగాన్ని ఆదుకోవాలని జూన్ 15వ తేదీన ఆఖిలపక్షం ఆధ్వర్యంలో కావలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో చింతం శేషారెడ్డి అశువులు బాసారని తెలిపారు. ఇప్పటికీ కూడా రైతులు కొత్తరకం సంక్షోభానికి గురవుతున్నారని రైతులను కాపాడాలని వ్యవసాయ రంగాన్ని అదానీ అంబానీలకు అప్పజెప్ప కూడదని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకం కూడా ప్రతిష్టంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కావలి రూరల్ మండల కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్య, బోగోలు మండలం రైతు సంఘం నాయకులు ఉప్పు యానాదయ్య, రైతుసంఘం మండల కమిటీ సభ్యులు చింతం వేణుగోపాల్ రెడ్డి, చింతం పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ధ్యేయం

ప్రజాశక్తి-కావలి


కావలి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

కావలి నియోజకవర్గంలో అవినీతి రహిత పాలనే ధ్యేయమని కావలి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే నిర్ణీత ఫీజులను వసూలు చేయాలని, వెనువెంటనే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఎంఎల్‌ఎగా ఎన్నికైన కావ్య క్రిష్ణారెడ్డి ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళనపై దృష్టి సారించారు. గతంలో మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి, వారి అనుచరులకు కప్పం కట్టడం కోసం కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి ఒక రేటు పెట్టి వసూలు చేయడం వల్ల ప్రజలపై భారం పడిందని ఆయనకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దానికి స్పందించిన ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఇకపై ఎవరికీ ఎలాంటి కప్పం కట్టవలసిన అవసరం లేదని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజలెవ్వరూ అధిక సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని, ఎలాంటి ముడుపులు సిబ్బందికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ఛార్జీల మేరకు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అవినీతికి పాల్పడితే తనకు ఫిర్యాదు చేయాలన్నారు.

'కాకర్ల'కు టిడిపి నేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి


'కాకర్ల'కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నేతలు

ఉదయగిరి అభివృద్ధి ప్రదాత చరిత్రను తిరగరాసే అభివృద్ధి చేసేందుకు అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌ను మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, టిడిపి ముఖ్య నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు మట్ల బ్రదర్స్ రామయ్య లక్ష్మయ్య జనసేన నాయకులు నాగేళ్ల రవి తదితర నాయకులతో కాకర్లను మర్యాదపూర్వకంగా వింజమూరు పార్టీ ప్రధాన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పూలమాలలు శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి ప్రజా సేవకులు నిరంతరం ప్రజల కోసం పారితపించే ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌తోనే సాధ్యమని ఇంతవరకు ఎవరు చూపని నియోజకవర్గ అభివృద్ధిని అది ఒక్క ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌తోనే సాధ్యమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్‌సి బాలుర హాస్టల్

- పెచ్చులూడుతున్న హాస్టల్ భవనం
- భయాందోళనలో విద్యార్థులు


పెచ్చులూడుతున్న హాస్టల్ గది పైకప్పు

ప్రజాశక్తి-మర్రిపాడు

నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు, వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం నిర్మించిన వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలోని గదుల్లో, భోజనశాల, వరండాలో స్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. నిద్రించు సమయంలో ఎక్కడ మీద పడతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం స్లాబ్ నుండి నీరు ఉరుస్తూ రూముల్లో నీళ్ల నిల్వ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు జిల్లాస్థాయిలో తమ ప్రతిభను కనబరిచారు. గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన వసతి గృహాన్ని గురించి దివంగత మంత్రి, జిల్లా అధికారులకు వివరించారు. అయినా ఫలితం లేదు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను సిబ్బంది కంటికి రెప్పలా చూచుకుంటున్నారు. నూతన ప్రభుత్వంలో జిల్లా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు, సంక్షేమ అధికారులు కోరారు.

విద్యార్థులకు పురస్కారాలు అందజేత


మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-దగదర్తి

దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం నగదు పురస్కారాలు అందించారు. జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రం, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాయోగ హెల్పింగ్ సొసైటీ సహకారంతో పదో తరగతిలో ప్రథమ తరగతి సాధించిన విద్యార్థికి రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.3వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.2వేలు వంతున నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ జి.విజయరత్నం మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చదువులో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ అఖిల, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు కరీముల్లా, దగదర్తి మండలంలోని పలు ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, యుటిఎఫ్ అధ్యక్షులు వి వి శేషులు, జి వి చలపతి శర్మ, కె.నాగిరెడ్డి, కె.వేణు, వి.గోపి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కె.కృష్ణా రెడ్డి, వంశీచరణ్, ఒ.సుధాకర్, ఎం.మహేష్, పి.మల్యాద్రి, జి.రమేష్, జి.వెంకటేశ్వర్లు, రమణమ్మ, అదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.



'కాకర్ల'ను కలిసిన అధికారులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌ను వింజమూరు మండల కేంద్రంలో టిడిపి ప్రధాన కార్యాలయంలో అన్ని మండలాల పోలీస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్ డబ్ల్యూ ఎస్ తదితర శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ అందరూ తమతమ విభాగాలలో తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఉదయగిరి ప్రజానీకానికి తమ సేవలను ఎలాంటి పక్షపాతం లేకుండా సులభతరంగా అందించాలని ఆదేశించారు. అనంతరం నియోజకవర్గం మొత్తం మండల వ్యాప్తంగా పార్టీలో పదవులు ఉన్న మండల నియోజకవర్గ జిల్లా రాష్ట్ర నాయకులు ప్రజా ప్రతినిధులు ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మరికొందరు వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుమతిగా ప్రదానం చేశారు. స్థానిక సమస్యలను కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలన్నీ కలిసికట్టుగా పరిష్కరించుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-బిట్రగుంట



బోగోలు పంచాయతీ బేతని పేటకు చెందిన టిడిపి నాయకులు గోచిపాతల సంజయ్ పేతనిపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి కావలి శాసనసభ్యుడిగా కావ్య క్రిష్ణారెడ్డి గెలుపొందిన సందర్భంగా బోగోలు మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బేతని పేట గ్రామంలో రోడ్డుకు ఇరువక్కల పిచ్చి కంపచెట్లు మొలిచి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారిందని, శనివారం జెసిపి సాయంతో బేతనపేట గ్రామంలోని రోడ్డుకిరువైపులా మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లు మరమ్మతులు కార్యక్రమం చేశామని తెలిపారు.

'కాకర్ల'ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-సీతారామపురం


'కాకర్ల'కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌ను వింజమూరులోని టిడిపి కార్యాలయంలో శనివారం సీతారామపురం మండలానికి చెందిన పలువురు టిడిపి నేతలు కలిసి ఉదయగిరి ఎంఎల్‌ఎగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకర్ల సురేష్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో ఉదయగిరి నియోజకవర్గం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందని, మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన సీతారామపురం మండలానికి అత్యధిక నిధులను వెచ్చించి అన్ని విధాల అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని పేద ప్రజలందరినీ అన్ని విధాల ఆదుకుంటూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఎంఎల్‌ఎ పదవితో మరింతగా ప్రజలకు సహాయం చేస్తారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎంఎల్‌ఎ భరోసా ఇచ్చారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి మేరకే రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పట్టం కట్టారని, రాష్ట్ర అభివృద్ధి వైపు బాటలు వేసేలా టిడిపి ప్రభుత్వంలో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంపై ప్రత్యేక చొరవ చూపి అత్యధిక నిధులు తీసుకువచ్చే సత్తా ఉన్న నాయకుడు కాకర్ల సురేష్ అని గతంలో ఏ నాయకుడు చేయని విధంగా ఉదయగిరి ప్రాంతం రాబోయే ఐదు సంవత్సరాలలో అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. సీతారామపురం మండలానికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలందరికీ అందుబాటులో ఉంటారని తెలిపారు. కాకర్ల విజయంపై సీతారామపురం మండల ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, మండల పార్టీ మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, టిడిపి యువ నాయకులు ఎడమ ప్రవీణ్, అథవేని రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.



బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా శనివారం మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని సలహాలు, సూచనలను ముస్లిం మత పెద్దలకు తెలియజేశారు. సోమవారం బక్రీద్ సందర్భంగా మండలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు.



మంత్రి 'ఆనం'ను కలిసిన మున్సిపల్ వైస్‌చైర్మన్ సర్దార్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గ శాసన సభ్యులుగా ఎన్నికై, మంత్రివర్గంలో స్థానం లభించి దేవదాయశాఖ మంత్రిగా ఆనం రామనారాయణ రెడ్డికి లభించడంతో శనివారం విజయవాడలోని గెట్ వే హోటల్‌లో ఆయనను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ ఆనం రామనారాయణ రెడ్డికి మంత్రి పదవి రావాలని ఆశించామని, అలానే ఆనం రామనారాయణరెడ్డికి మంత్రిపదవి దక్కడంతో నియోజక వర్గంలో ప్రజలంతా సంతోషకరంగా ఉన్నారని తెలిపారు. ఆత్మకూరును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయనవెంట షేక్ కాజా మస్తాన్, మొగల్ సల్మాన్, సుమన్, సుల్తాన్ తదితరులున్నారు.

మంత్రి 'ఆనం'కు శుభాకాంక్షలు


ఆనంకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలయ్య

ప్రజాశక్తి-మర్రిపాడు : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డిని మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులు పాలెం పోలయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో 27రకాల ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం చేసి ఇష్టానుసారంగా దారి మళ్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి ఎస్‌టి గ్రామాల అభివృద్ధిని పక్కనపెట్టిందని, మౌలిక వసతులకల్పన దూరం చేసిందన్నారు. బెస్ట్ అవైలబుల్ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు, నియోజకవర్గ అభివృద్ధి ఆనంతోనే సాధ్యమన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



ప్రజాశక్తి-కోవూరు : బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని యల్లాయపాళెం అంగనవాడీ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు శనివారం యల్లాయపాళెం సెక్టార్ అంగన్‌వాడీ సెంటర్ నుంచి పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం విద్యా బోధన తదితర అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి, మహిళా పోలీస్ మేరీ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కాకర్ల'ను కలిసిన మట్ల వెంకటేష్

ప్రజాశక్తి-ఉదయగిరి



నియోజక వర్గ శాసన సభ్యులు కాకర్ల సురేష్‌ను యువ నేత మట్ల వెంకటేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శ్రేయస్సును కోరి వారి సమస్యలను తెలుసుకొని ఉచితంగా ఆపరేషన్లు మందులు పంపిణీ చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నో కుటుంబాలను ఆదుకున్న మహోన్నత వ్యక్తిని నియోజకవర్గ ప్రజలు గుర్తించి అత్యధిక మెజార్టీని ఇచ్చారని ఆయన గెలుపు నియోజకవర్గం ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాయన్నారు. ఉదయగిరి ప్రాంత అభివృద్ధి నిరుద్యోగం వలసలు నివారణ ప్రజాసేవకులు మెట్ట ప్రాంత తాగునీటి ప్రదాతలైన ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వారి సారథ్యంలోనే అది జరుగుతుందన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ కాకర్లను మట్ల వెంకటేష్ యాదవ్ శాలవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువనేత మట్ల వెంకటేష్, ఈశ్వరయ్య, పిచ్చయ్య, నాగేంద్ర, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి

కావలి "ఇండియన్ మెడికల్ అసోసియేషన్" వారి ఆధ్వర్యంలో కావలి ప్రాంతీయ జన విజ్ఞాన వేదిక, రెడ్‌క్రాస్, పలు స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలతో "డాక్టర్స్ డే" సందర్భంగా జూన్ 30 జూలై 1వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని జెవివి కావలి పట్టణ కమిటి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అని, అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అని తెలిపారు. ప్రస్తుతం కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ప్రజలకు అవసరమైన రక్త నిల్వలు తగ్గి ఉన్నాయన్నారు. కావున కావలి పట్టణ, పరిసర ప్రాంతాల యువతీ యువకులు, ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలచి, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కావలి ప్రాంతీయ జన విజ్ఞాన వేదిక కోరుకుంటుందన్నారు. వివరాలకు తోట.వెంకటేశ్వర్లు 7995808802, గాదిరెడ్డి.హరనాథ్ 9399999885 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

టిడిపి కేడర్‌లో నూతనోత్సాహం..

ప్రజాశక్తి-నెల్లూరు

వీక్షణం

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు విజయం సాధించడంతో 2019 నుంచి నేటి వరకు నిరుత్సాహం, నిశబ్దం వాతావరణంలో ఉన్న టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. మంత్రివర్గంలో ప్రత్యేక్షంగా జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు పదవులు దక్కడం.. పరోక్షంగా జిల్లాతో సంబంధాలు కలిగి ఉన్న మరి కొంత మందికి పదవులు దక్కడంతో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణుల్లో ఆనందం అంతా ఇంతా కాదు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, మొట్టమొదటి సారిగా నగరానికి చేరుకున్న డాక్టరు పొంగూరు నారాయణ పుట్టిన రోజు శనివారం కావడంతో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకోవడంలో మునిగి తేలిపోయాయి. నిన్న మొన్నటి వరకు టిడిపి నాయకులతో పట్టి పట్టనట్లు, ముభావంగా వ్యవహరించిన అధికారులు సైతం టిడిపి నాయకుల ఇళ్లకు క్యూ కట్టారు. ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసిపి నేతలు మాత్రం అధికార పక్షాన్ని ఇరుకున పడేసేందుకు ఎప్పుడు అవకాశం వస్తుందా అని వేచి చూస్తున్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అనధికారికంగా, ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా క్రషింగ్ వ్యాపారం చేస్తున్నారంటూ మైనింగ్ అధికారులు నోటీసులు అందజేశారు. అపరాధ రుసుంగా కోట్లాది రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. అంతే కాకుండా కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే జిల్లాలో వైసిపి ప్రభుత్వం పేరు చెప్పుకొని ఆ పార్టీ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడితే రాష్ట్రంలో ఎంతటి స్థాయిలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయో అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను మూసి వేస్తూ ఆదేశాలు జారీ చేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభిస్తామని, గతంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రాంతాలను మున్సిపల్ శాఖ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ నగరంలో పరిశీలించారు. జిల్లాలో అన క్యాంటీన్లు తిరిగి ప్రారంభిస్తామని హామీలు సైతం ఇచ్చారు. దాంతో ప్రజలు అన్న క్యాంటీన్లను టిడిపి ప్రభుత్వం ఎప్పుడు ప్రారంభిస్తుందో అని ఆశతో ఎదురు చూస్తున్నారు.